అగ్నిమాపక సిబ్బంది సేవలు భేష్

- ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించడం అభినందనీయం
- అగ్నిమాపక వారోత్సవాల ముగింపులో పలువురి వెల్లడి

రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈ నెల 14 నుంచి ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. అగ్నిప్రమాదాలు సంభవించిన వెంటనే 101 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. అదేవిధంగా సంఘటన ఎక్కడ జరిగింది, బాధితులకు సంబంధించిన ఫోన్ నంబర్లు ఇవ్వాలని ఆ శాఖ అధికారులు కోరారు. ఈ సందర్భంగా ప్రమాదాల్లో సేవలు అందించిన సిబ్బందిని తహసీల్దార్లు సన్మానించారు.


ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుధాకర్


గాంధారిలో అగ్నిమాపక శాఖ రిటైర్డ్ ఉద్యోగిని సన్మానిస్తున్న తహసీల్దార్

ఎల్లారెడ్డి: అగ్ని ప్రమాదాల నివారణలో ఆశాఖ సిబ్బంది కృషి ఎనలేనిదని తహసీల్దార్ సుధాకర్ పేర్కొన్నారు. గురువారం ఎల్లారెడ్డి అగ్నిమాపక శాఖ కార్యాలయంలో నిర్వహించిన వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాటాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు బాధితుల ప్రాణాలు, ఆస్తి పాస్తులను కాపడడంలో సిబ్బంది తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించడం అభినందనీయం అన్నారు. అనంతరం అగ్నిమాపక శాఖ సిబ్బంది వినియోగించే వస్తువులను ప్రదర్శించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ కిష్టయ్య, సిబ్బంది సలాం పాల్గొన్నారు.

గాంధారి: అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి తహసీల్దార్ గోవర్ధన్ హాజరయ్యారు. అనంతరం అగ్నిమాపక శాఖ రిటైర్డ్ ఎల్ఎఫ్ విఠల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంజీవు, ఏవో నరేష్, గిర్దావర్ నసింహా రెడ్డి పాల్గొన్నారు.

మద్నూర్: మండల కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇంచార్జి ఫైర్ ఆఫీసర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఏప్రిల్ 14న ముంబై ఓడరేవులో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు మంటలు ఆర్పే క్రమంలో 46 మంది అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలు పోగొట్టుకున్నారని, వారి జ్ఞాపకార్థం అప్పటి నుంచి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించడం అభినందనీయం అని సర్పంచ్ సురేశ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఉప సర్పంచ్ విఠల్, నాయకులు రచ్చ కుషాల్, అగ్నిమాపక సిబ్బంది వెంకన్న, నరసింలు, రాణా ప్రతాప్ పాల్గొన్నారు.


మద్నూర్‌లో మాట్లాడుతున్న అగ్నిమాపక శాఖ అధికారి వినోద్ కుమార్

రంజాన్ కానుకల పంపిణీ


గర్గుల్‌లో కానుక పంపిణీ చేస్తున్న ఎంపీపీ


చిన్నమల్లారెడ్డిలో..

కామారెడ్డి రూరల్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కామారెడ్డి ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు అన్నారు. గురువారం మండలంలోని గర్గుల్ గ్రామంలో ముస్లింలకు ప్రభుత్వం సరఫరా చేసిన రంజాన్ కానుకను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతల రవితేజగౌడ్, జెడ్పీటీసీ చిదుర రమాదేవి లక్ష్మారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ పాత లక్ష్మణ్, వైస్ చైర్మన్ శంకర్‌గౌడ్, వైస్ ఎంపీపీ నరేష్, గూడెం బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నమల్లారెడ్డిలో..
మండలంలోని చిన్నమల్లారెడ్డి, లింగాయిపల్లి గ్రామాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోపిగౌడ్ రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు బీమాయాల నీలమ్మ, కమ్మరి అనంతలక్ష్మి శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యుడు ఫజిల్ తదితరులు పాల్గొన్నారు.

పిట్లం: మండలంలోని చిన్న కొడప్‌గల్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ముస్లింలకు రంజాన్ కానులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు

తాడ్వాయి: మండలంలోని క్రిష్ణాజివాడి గ్రామంలో సర్పంచ్ భూషణం ఆధ్వర్యంలో ముస్లింకు గురువారం రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తిరుపతిరెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


చిన్న కొడప్‌గల్‌లో..


తాడ్వాయి మండలం క్రిష్ణాజివాడిలో..

కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం


కొయ్యగుట్ట వద్ద వర్షానికి తడుస్తున్న ధాన్యం

బాన్సువాడ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఉరుములతో కూడిన వర్షం కురిసింది. దీంతో బోర్లం, కొయ్యగుట్ట, తిర్మలాపూర్, కొత్తాబాది తదితర గ్రామాల్లో రోడ్లపై, కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న స్పీకర్


బీర్కూర్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న స్పీకర్


నిజాంసాగర్‌లో..

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండల కేంద్రంలో గురువారం మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందులో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన ముస్లింలకు వివిధ రకాల పండ్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ద్రోణవల్లి సతీష్, ఆవారి గంగారాం తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం మసీద్ వద్ద ఖాజా గరీబ్ నవాజ్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు తన్వీర్, ఎంఐఎం మండల అధ్యక్షుడు సయీద్, బీఆర్ఎస్ నాయకులు వహాబ్, రెడ్‌క్రాస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రైతు బంధు మండల డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్: మండల కేంద్రమైన నిజాంసాగర్‌లో జుక్కల్ కాంగ్రెస్ నేత తోట లక్ష్మీకాంతరావు ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జయప్రదీప్, బాల్‌సాయిలు, న్యాయవాది రాంరెడ్డి, కృష్ణారెడ్డి, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంలోని మసీద్‌లో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సూచన మేరకు బీఆర్ఎస్ నాయకులు ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గండ్ర మధుసూధన్‌రావ్, జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ శారద, సర్పంచ్ అంజలి తదితరులు పాల్గొన్నారు.

మసీద్ నిర్మాణానికి భూమి పూజ



నస్రుల్లాబాద్: మండలంలోని మైలారం గ్రామంలో రూ. 20 లక్షలతో నిర్మిస్తున్న మసీద్‌కు గురువారం డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పాల్త్య విఠల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్, మాజీద్, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి



కామారెడ్డి టౌన్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నాయీ బ్రాహ్మణులకు వర్తింపజేయాలని కోరుతూ తెలంగాణ నాయీ బ్రాహ్మణ జనశక్తి సేవా సంఘం జిల్లా కమిటీ సభ్యులు గురువారం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మహేందర్, కార్యదర్శి రవీందర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎల్లం, ఉపాధ్యక్షుడు నాందేవ్, స్వామి, రాజు, నాయి, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి అర్బన్: బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శిగా మంత్రి సుమప్రియ, కామారెడ్డి మండల అధ్యక్షురాలిగా సిరిసిల్ల భారతి, ప్రధాన కార్యదర్శిగా చింతల శారద, పట్టణ అధ్యక్షురాలిగా గుజ్జ రాజమణి, ప్రధాన కార్యదర్శులుగా రాపర్తి సంగీత, ఎం.బాలవ్వ, ఉపాధ్యక్షురాలుగా జి.లత, ఎం.భార్గవిలను నియమించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు, మహిళా అధ్యక్షురాలు ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో రుద్రహోమం



పిట్లం: మండలంలోని పోతురెడ్డిపల్లి హనుమాన్ ఆలయంలో గురువారం ఆలయ నిర్వాహకులు తేజ స్వామి, భక్తులు రుద్రహోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

సంక్షిప్తం

మహిళలకు ఉచిత శిక్షణ
కామారెడ్డి టౌన్: కామారెడ్డిలోని దేవునిపల్లిలో ఉన్న అక్షయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంప్యూటర్ టెక్నాలజీ ద్వారా గ్రామీణ మహిళలకు టైలరింగ్, మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎస్. భూపాల్ తెలిపారు. వివరాలకు 9949173338, 7416713338 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం
భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ శ్రీలక్ష్మి వెంకటేశ్వరాలయం అభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఉమారాణి, గీత, బాలాచారి, విష్ణుప్రియ, దయాకర్ విరాళం అందజేశారు.

ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని డిమాండ్
నాగిరెడ్డిపేట: మండలంలోని ధర్మారెడ్డి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న కన్నారెడ్డి గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని స్థానికులు ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ క్షమాపణ చెప్పాలి
మాచారెడ్డి: మాజీ మంత్రి షబ్బీర్ అలీ కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేష్ నాయక్ తదితరులు డిమాండ్ చేశారు.

స్పీకర్ పోచారంను విమర్శిస్తే ఖబడ్దార్

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ఆగ్రహం


మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ: ప్రజాసేవ కోసం నిరంతరం కృషి చేస్తోన్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని విమర్శిస్తే ఊరుకోమని, ఖబడ్దార్ బండి సంజయ్ అంటూ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా కరీంనగర్‌కు ఏం చేశావో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోనే బాన్సువాడను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్న ఘనత స్పీకర్‌కే దక్కిందన్నారు. డీసీసీబీ హోదాలో అధికారిక కార్యక్రమాలకు హాజరుకావడం తప్పా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మోహన్ నాయక్, అంజిరెడ్డి, గంగాధర్, పాత బాలకృష్ణ, ఎజాస్, గోపాల్‌రెడ్డి, గురువినయ్, వెంకట్‌రాంరెడ్డి, వనం గంగాధర్, ఖమ్రు, శ్రీనివాస్, గడుమల లింగం, ప్రశాంత్, హకీం, వెంకటేష్, నర్సగౌండ, నర్సన్న చారి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

భిక్కనూరు: ఎవరి హయాంలో ఎలాంటి అభివృద్ధి జరిగిందో బహిరంగ చర్చకు తాము సిద్ధమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దబచ్చగారి నర్సింహారెడ్డి కాంగ్రెస్ నేతలకు సూచించారు. గురువారం భిక్కనూరులో ఎంపీపీ గాలిరెడ్డి, సర్పంచ్ తున్కి వేణు, మార్కెట్ కమిటీ చైర్మన్ భగవంత్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కామారెడ్డికి గోదావరి జలాలు తీసుక వచ్చామని గొప్పలు చెబుతున్న కాంగ్రెస్ నేతలు ఆ పైపులైన్ పనులకు సంబంధించి కమీషన్ల కోసం కక్కుర్తి పడ్డ విషయమై బహిరంగ చర్చకు రావాలని సూచించారు. కాంగ్రెస్ హయాంలో చేపట్టిన పనులన్నీ నాసిరకంగా చేశారని ఆరోపించారు. ఎప్పుడూ కన్పించని మాజీ మంత్రి షబ్బీర్ అలీ వచ్చే ఎన్నికల్లో ఓట్ల కోసం తన భార్యతో కలిసి దేవాలయాలకు, పెళ్లిళ్లకు వస్తున్నారని, అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు రాలేదో చెప్పాలని ప్రశ్నించారు. ఇకనైన కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రకటనలు మానుకోవాలని సూచించారు. సమావేశంలో ఆలయ పునర్ నిర్మాణకమిటీ చైర్మన్ అందె మహేందర్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కిష్టగౌడ్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ పాల రాంచంద్రం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, విండో చైర్మన్లు గంగళ్ల భూమయ్య, రాజగౌడ్, నాగర్తి భూంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగుతో పేదల జీవితాల్లో వెలుగు


గుండారంలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్


గౌరారంలో సర్పంచ్ అనసూయ..

రాజంపేట: కంటి వెలుగు కార్యక్రమంతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని గుండారం సర్పంచ్ ర్యాకం లక్ష్మణ్ పేర్కొన్నారు. గురువారం గుండారంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆధార్ కార్డు వెంట తెచ్చుకొని ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శంకర్, క్యాంపు మెడికల్ ఆఫీసర్ సంగీత, పల్లె దవాఖన వైద్యులు నవీన్, సొసైటీ డైరెక్టర్ సాయిలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పిట్లం: మండలంలోని గౌరారంలో సర్పంచ్ అనసూయ కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కంటి సమస్యలున్న వారందరూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

మిషన్ భగీరథ నీటిలో జలగలు

- తాగేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు


ఎల్లారెడ్డి పట్టణంలో సరఫరా చేసిన మిషన్ భగీరథ నీటి సరఫరాలో వచ్చిన జలగలు

ఎల్లారెడ్డిరూరల్: మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరాయ్యే నీటిలో జలగలు వస్తున్నాయి. ఎల్లారెడ్డి పట్టణంలోని 8, 9 వార్డుల్లో గురువారం సరఫరా చేసిన నీటిలో జలగలు, చేపలు, పురుగులు వస్తుండటంతో నీటిని తాగేందుకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా కాక ముందు పట్టణంలోని పెద్ద చెరువు నీటిని ఫిల్టర్ చేసి సరఫరా చేసే వారు. అనంతరం మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేయడంతో సింగూరు జలాలను తాగునీటి కోసం సరఫరా చేస్తున్నారు. ఎక్కువ మంది మిషన్ భగీరథ నీటినే తాగేందుకు వినియోగిస్తున్నారు. గతంలోనూ కొన్నిరోజుల పాటు జలగలు, పురుగులు నీటి సరఫరాలో వచ్చినట్లు స్థానికులు వెల్లడించారు.

మా దృష్టికి రాలేదు

స్వచ్ఛమైన నీటినే సరఫరా చేస్తున్నాం. మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా అయ్యే నీటిలో జలగలు, పురుగులు వస్తున్న విషయం తన దృష్టికి రాలేదు.

– వినోద్, ఏఈ, మున్సిపాలిటీ, ఎల్లారెడ్డి

ఇలా అయితే తాగేదెలా?



మిషన్ భగీరథ నీటి సరఫరాలో జలగలు, పురుగులు వస్తే ఆ నీటిని ఎలా తాగాలి. కొన్నేళ్లుగా మిషన్ భగీరథ నీటినే తాగుతున్నాం. సమస్య ఎక్కడుందో అధికారులు గుర్తించాలి.

– సిద్ధు, ఎల్లారెడ్డి

చర్యలు తీసుకోవాలి



నీటిలో జలగలు, చేపలు, పురుగులు రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలి. అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి.

– వెంకట్, ఎల్లారెడ్డి

తూకాలపై దృష్టి సారించాలి

నిజాంసాగర్: కొనుగోలు కేంద్రాల్లో వసతుల కల్పనతో పాటు ధాన్యం తుకాలపై సెంటర్ ఇంచార్జిలు బాధ్యత వహించాలని అచ్చంపేట సొసైటీ చైర్మన్ కయ్యం నర్సింహారెడ్డి సూచించారు. సొసైటీలో ఆయన కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలతో సమావేశం నిర్వహించారు.

కామారెడ్డి రూరల్: మండలంలోని గర్గుల్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు కోసం సింగిల్ విండో చైర్మన్ పాత లక్ష్మన్, వైస్ చైర్మన్ శంకర్‌గౌడ్, ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులుతో పాటు పలువురు పరిశీలించారు.

క్లుప్తంగా

మట్టి తరలింపును అడ్డుకోవాలని నిరసన



మద్నూర్: మండలంలోని హండెకేలూర్ చెరువు నుంచి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్నా అధికారులు స్పందించడం లేదని ఆరోపిస్తూ బీజేపీ నాయకులతో కలిసి ఆ గ్రామ సర్పంచ్ నీలావతి గురువారం తహసీల్దార్ ఛాంబర్‌లో నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. జేసీబీలను వినియోగించి మట్టిని తరలిస్తున్నా ఎందుకు స్పందించడం లేదని తహసీల్దార్ అనిల్‌కుమార్‌తో వాగ్వాదానికి దిగారు. చర్యలు తీసుకోవాలని గతంలో వినతిపత్రం ఇచ్చినా స్పందించక పోవడంపై తహసీల్దార్‌ను ప్రశ్నించారు. మట్టిని వ్యవసాయ భూములకు తరలిస్తారని తహసీల్దార్ అనిల్ కుమార్ పేర్కొనడాన్ని వారు ఆక్షేపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు హన్మండ్లు, నాయకులు తుకారం, వెంకట్‌కాలే, హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



కామారెడ్డి టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24 నుంచి గ్రామాలు, పట్టణాల్లో సభలు, సమావేశాలు నిర్వహిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి దశరత్ వెల్లడించారు. గురువారం కామారెడ్డిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 24న రామారెడ్డి మండలం సింగరాయిపల్లి, పాల్వంచ గ్రామాల్లో బహిరంగ సభలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాకులు బాలరాజ్, దేవయ్య, ఈశ్వర్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

సమస్యలుంటే చెప్పండి



లింగంపేట: మండలంలోని పర్మళ్ల గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ హామీ ఇచ్చారు. గురువారం ఆయన పర్మళ్ల గ్రామస్తులతో సమావేశమై సమస్యలుంటే చెప్పాలని సూచించారు. గ్రామంలో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయానికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సిద్దారెడ్డి, ముదాం సాయిలు, నరహరి, బద్ద లక్ష్మయ్య, విఠల్‌రెడ్డి, పర్వయ్య, సర్వన్, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జాబ్ మేళాలో పలువురికి ఉద్యోగాలు



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని స్ఫూర్తి వొకేషనల్ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. ప్రముఖ ఆస్పత్రులైన రష్, మెడికేర్, లైఫ్, శిశురక్ష, జయ, దేవి, గంగ ఆసుపత్రుల్లో ఏఎన్ఎం, ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాల కోసం నిర్వహించిన జాబ్ మేళాలో 56 మంది ఏఎన్ఎంలుగా, 22 మంది ల్యాబ్ టెక్నీషియన్లుగా ఎంపికయ్యారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే కాంగ్రెస్‌కు బలం



రామారెడ్డి: కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని కాంగ్రెస్‌కు చెందిన జెడ్పీ ఫ్లోర్ లీడర్ మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలోని ఉప్పల్‌వాయిలో కాంగ్రెస్ సభ్యత్వం ఉన్న కార్యకర్తలకు బీమా కార్డులను అందజేశారు. ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ. 2 లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోసానిపేట సర్పంచ్ గీరెడ్డి మహేందర్ రెడ్డి, నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రామిరెడ్డి, ఇర్ఫాన్, రాజు, నారాయణ, శంకర్ పాల్గొన్నారు.